క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలి



ఎస్‌ఐ ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా పోలీసులు

మునగపాక : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక పీఎస్‌కు నూతనంగా ఎస్‌ఐగా నియమితులైన ప్రసాదరావును శుక్రవారం మండలంలోని మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమవుతూ గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు మహిళా పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాడనర్సాపురంలో ఉచిత వైద్య శిబిరం



శిబిరానికి హాజరైన వైద్యులు, సిబ్బంది

రాంబిల్లి : వాడనర్సాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విష్ణు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు సుధీర్, సందీప్, అనిల్ సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, మాజీ సర్పంచ్ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి దాతల సహకారం



గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

మునగపాక : మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి దాతల సహకారం అందుతోంది. ఆలయ నిర్మాణంలో తాము సైతం అంటూ పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం అనకాపల్లికి చెందిన మద్దాల వినయ్ కుమారుడు పరమేశ్వరరావు రూ.20116 నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాతలు మరింత ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరుతున్నారు.

ఉత్సవాలు సజావుగా నిర్వహించాలి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. శనివారం మునగపాకలో జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవం విజయవంతానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో కమిటీ సభ్యులతో శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. అశ్లీలతకు అవకాశం లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, సూరిశెట్టి రాము, టెక్కలి కొండలరావు, పెంటకోట వెంకట్, ఆడారి కాశీబాబు, ఎంఎం నాయుడు, సూరిబాబు, హరీష్ పాల్గొన్నారు.

ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులపై కేసు నమోదు

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల్ని స్థానికులు పట్టుకున్నారు. పశువులను దొంగిలించేవారని భావించి ఇద్దరినీ తాళ్లతో కట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

పట్టాల పండగ



నక్కపల్లి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద లబ్ధిదారుల కోలాహలం

నక్కపల్లి: అర్హులైన పేదలకు జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు కల్పించే ప్రక్రియ ప్రారంభమయింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కోలాహలం నెలకొంది. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 11 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ జరిగింది. ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కు కల్పించాలనే ఉద్దేశ్యంతో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే ప్రక్రియ ప్రారంభమయింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు, ఎంపిక చేసిన సచివాలయాల్లో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడంతో నక్కపల్లి, పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది కార్యాలయానికి తరలి వచ్చారు. లక్షలాది రూపాయల విలువైన ఇంటి స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఖర్చును భరించి లబ్ధిదారుల పేరిట ఇంటి స్థలాన్ని రిజిస్టర్ చేసి ఇవ్వడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇలా ఇంటి స్థలం మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం, ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేసిన దాఖలాలు లేవని పలువురు లబ్ధిదారులు అంటున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..



నాకు ఉద్దండపురంలోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం కూడా మంజూరు చేశారు. స్థలంతో పాటు ఇప్పుడు మా పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తూ సంపూర్ణ హక్కు కల్పించడం ఆనందంగా ఉంది. మా కుటుంబం అంతా జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. గత ప్రభుత్వాల హయాంలో ఇటువంటి కార్యక్రమం ఎప్పుడూ జరగలేదు. – కె. దుర్గ, ఉద్దండపురం

సీఎం జగన్ ఆశయం నెరవేర్చాలి..



ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఒకే విడతలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. ఇటువంటి కార్యక్రమం చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 11 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులందరికీ పూర్తి హక్కు కల్పించే ఉద్దేశ్యంతో వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు ఇస్తున్నాం. లబ్ధిదారులంతా జగనన్న ఆశయం నెరవేర్చాలి. – కంబాల జోగులు, సమన్వయకర్త

శభాష్ వలంటీర్



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణకు పింఛన్ అందజేస్తున్న తిమ్మరాజుపేట వలంటీర్ సాయిలక్ష్మి



అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో రాజులమ్మకు పింఛన్ అందజేస్తున్న నాగులాపల్లి వలంటీర్ రమ్య

మునగపాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తోంది. తమకు కేటాయించిన 50 కుటుంబాలకు వలంటీర్లు మెరుగైన సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా తిమ్మరాజుపేటకు చెందిన ముప్పిడి రమణ అనారోగ్యంతో బాధపడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో సంబంధిత వలంటీర్ ముప్పిడి సాయిలక్ష్మి ఫిబ్రవరికి పింఛన్ రూ.3 వేలు అతనికి అందజేశారు. అలాగే నాగులాపల్లికి చెందిన మంత్రి రాజులమ్మ అనారోగ్యంతో బాధపడుతూ అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ మళ్ల రమ్య శుక్రవారం రాజులమ్మకు ఫిబ్రవరి నెల పింఛన్ రూ.3 వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టంలో లయన్స్ క్లబ్ సేవా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని క్లబ్ పాస్ట్ చైర్మన్ వర్మ కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ రూ.35 లక్షల విలువ గల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నర్సీపట్నం శాఖ ఆధ్వర్యంలో కాన్వెంట్లుగా పేద విద్యార్థులకు చేయూత, పేదలకు వివిధ రకాల పరికరాలు పంపిణీ చేసి క్లబ్ సేవలను విస్తృతం చేస్తున్నామన్నారు. ఇక్కడ సేవా కార్యక్రమాలపై ఆసక్తితో లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మూర్ విచ్చేస్తున్నారన్నారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.గోపాలరావు, పాస్ట్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష..’ నిరంతర ప్రక్రియ

- ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
- నక్కపల్లి, రాంబిల్లిలో సేవలను పర్యవేక్షించిన నాయకులు



దోసూరులో శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



డొంకాడలో మాట్లాడుతున్న నాయకులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి



డొంకాడలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని మండల ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ అన్నారు. శుక్రవారం డొంకాడలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన వారు రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలువురు రోగులతో మాట్లాడి ఏయే సమస్యలతో శిబిరానికి వచ్చారని ప్రశ్నించారు. వారందరికీ స్వయంగా దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రులకు వెళ్లలేని వారి కోసం జగనన్న ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోనే వైద్యం అందజేస్తున్నారని అన్నారు. ఈ శిబిరాల్లో ఏడు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోను మొదటి విడత శిబిరాల నిర్వాహణ పూర్తయి రెండో విడత ప్రారంభమయిందన్నారు. డాక్టర్లే ఇంటి వద్దకు వచ్చి రోగుల సమస్యలు తెలుసుకునే సదుపాయాన్ని జగనన్న ప్రభుత్వం కల్పించిందన్నారు. డొంకాడ, కొత్తూరు, సీతానగరం తదితర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ స్టాల్‌ను అధికారులు, నాయకులు సందర్శించారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఈ శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ చందిన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో..

రాంబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ జి.శిరీష శ్రీనుబాబు అన్నారు. మర్రిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ తదితర వైద్యులు, సిబ్బంది వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు తాతాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు అప్పన్నదొర, అధికారులు పాల్గొన్నారు.

గుర్రాజుపేటలో..

ఎస్.రాయవరం: జగనన్న సురక్షతో సంపూర్ణ వైద్య సేవలు అందుకోవచ్చని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో రెండవ విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు అందజేశారు. డాక్టర్ రాజేశ్వరితో పాటు, అదనంగా జనరల్ ఫిజీషియన్ అరుణ్‌కుమార్, ఈఎన్‌టీ ఆర్. రవి వైద్య సేవలు అందజేశారు. 361 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా నలుగురిని మెరుగైన వైద్యం కోసం పట్టణ ఆస్పత్రులకు తరలించినట్టు వైద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో సత్యనారాయణమూర్తి సందర్శించారు.

దోసూరులో..

అచ్యుతాపురం : మండలంలోని దోసూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 362 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు విజయ్, కో–ఆప్షన్ జెడ్పీటీసీ సభ్యుడు నర్మాల కుమార్, సర్పంచ్ నర్మాల సుజాత, నర్మాల రామకృష్ణ, ప్రసన్నకుమార్, జి.రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



ఇన్‌చార్జి ఎమ్మెల్యే కంబాల జోగులును కలిసిన ఎంపీడీవో సత్యనారాయణమూర్తి

ఎస్.రాయవరం: అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో సత్యనారాయణమూర్తి మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కంబాల జోగులును కలిశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి పని ఎప్పటికప్పుడు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైస్ ఎంపీపీలు బొలిశెట్టి గోవిందు, చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, శానాపతి శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యుడు బైపా శ్రీనివాసరావు, శ్రీపతిరాజు, కాసెప అప్పన్న, భీమరశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పగటి పూట ఇవ్వాలి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి : వ్యవసాయ అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏడుగంటల పాటు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పగటి పూట సరఫరా చేయాలంటూ పలువురు రైతులు శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం తదితర గ్రామాల రైతులు ఏఈని కలిశారు. ప్రభుత్వం ఏడు గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందజేస్తోందని అయితే రాత్రిపూట ఇవ్వడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండటం లేదన్నారు. గతంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇచ్చేవారన్నారు. రాత్రిపూట సరఫరా వల్ల రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. విషసర్పాల బారిన పడే అవకాశం ఉన్నందున ఉదయం పూట సరఫరా పునరుద్ధరించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఏఈని కలిసిన వారిలో నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, రైతు నాయకులు సురేష్‌రాజు, రాంబాబు, శ్రీనివాసరావు, తాతరాజు, రమేష్‌రాజు, సూరిబాబురాజు తదితరులు న్నారు.

ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేయాలి

యలమంచిలి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, సర్కారీ బడుల బలోపేతానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార సాంకేతిక నైపుణ్యంపై మూడు మండలాల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. 21వ శతాబ్దంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందజేయడంలో సమాచార సాంకేతిక నైపుణ్యం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. తరగతి గదిలో సృజనాత్మకంగా బోధన చేయడానికి ఉపాధ్యాయులంతా ఎప్పటికప్పుడు తమను తాము నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం యలమంచిలి, రాంబిల్లి, ఎస్. రాయవరం మండలాలకు చెందిన సుమారు 76 మంది మ్యాథ్స్ టీచర్లకు జిల్లా రిసోర్సు పర్సన్లు డి. నిత్యానందం, కె. శ్రీనివాసరాజు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పరికరాలను మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. గతంలో మూస పద్ధతిలో కాకుండా శిక్షణ కొత్తదనంతో ఉండటంతో ఉపాధ్యాయులంతా సద్వినియోగపర్చుకున్నారని రిసోర్సు పర్సన్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట హైస్కూల్ హెచ్‌ఎం వై.వి. రమణ పాల్గొన్నారు.

కంబాల జోగులు సుడిగాలి పర్యటన



పేటసూదిపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమన్వయంతో పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, ఇన్‌చార్జి కంబాల జోగులు సూచించారు. మండలంలో జేవీపాలెం, వేమగిరి, పేటసూదిపురం, సర్వసిద్ధి, వాకపాడు, ఉప్పరాపల్లి, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం ఎస్.రాయవరం గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి కార్యకర్తలను కలుసుకున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టి తొలిసారి గ్రామాల్లోకి విచ్చేసిన జోగులుకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎస్.రాయవరం, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ అల్లాడ నాగరాజు, చేకూరి శ్రీరామచంద్రరాజు, సర్పంచ్ ముప్పిన అబ్బాయిదొర పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: కోనాం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న పాఠశాలలో ఉంటుందన్నారు.

ధర్మనిధి సభ్యత్వాలు చేయాలి



ప్రచార ప్రతులను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పాయకరావుపేట : మండలంలో గల గ్రామాల్లో ధర్మనిధి సభ్యత్వాలు చేపట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ అన్నారు. కేశవరం గ్రామంలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గల ఆయా దేవాలయాల్లో ప్రతి వారం భజన కార్యక్రమాలు చేపట్టాలని, ధర్మనిధిపై సభ్యత్వాలు నమోదు చేయాలని, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతులు, నగర సంకీర్తనలు చేపట్టాలన్నారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ ప్రచార ప్రతులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల సంయోజక్ తాడి సూర్యమూర్తి, ఖండ సంయోజక్ నీలాపు వెంకటరెడ్డి, ధర్మ ప్రచారక్‌లు కట్టా వీరబాబు, మేడిశెట్టి దివాణం, చేపల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ నారాయణ రావు

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్‌ఐగా ఎం.నారాయణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసే ఇద్దరు ఎస్‌ఐలలో ఒకరికి పదోన్నతి లభించగా, వేరొకరు బదిలీపై వెళ్లారు. వీరిద్దరి స్థానంలో బదిలీపై విచ్చేసిన నారాయణరావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

19న ఆలయ నిర్మాణానికి శ్రీకారం



ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు

మునగపాక : మునగపాకలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈ నెల 19న పెద్ద ఎత్తున శంకుస్థాపన నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో బైపాస్ రోడ్డును ఆనుకుని నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర రామాలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని శుక్రవారం పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. శంకుస్థాపన రోజున 5 వేలకు పైగా అన్న సమారాధన ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట పెద్దలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు, రామజోగినాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ పాపారావుకు స్వాగతం పలుకుతున్న వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది



తహసీల్దార్ అప్పలరాజును అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది



బాధ్యతలు స్వీకరిస్తున్న తహశీల్దార్ సరోజిని



తహసీల్దార్ సూర్యనారాయణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

మునగపాక : మునగపాక తహసీల్దార్‌గా పాపారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా మందస మండల తహసీల్దార్‌గా పని చేసిన పాపారావును మునగపాక మండల తహసీల్దార్‌గా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. మునగపాక మండల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

యలమంచిలిలో..

యలమంచిలి : యలమంచిలి మండలానికి కొత్తగా నియమింపబడిన తహసీల్దార్ ఆర్.అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్. పేటలో పని చేస్తున్న ఆయనను యలమంచిలికి బదిలీ చేశారు. ఆయనను డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రాచారి, ఎలక్షన్ డీటీ గణపతిరావు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, సీనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు అభినందించారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట : మండల తహసీల్దార్‌గా జీవీ సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఇంత వరకు పని చేసిన ఆయన పాయకరావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కె.జయప్రకాష్ బదిలీ అయ్యారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల తహశీల్దార్‌గా పి.సరోజిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ తహశీల్దార్‌గా పని చేసిన శ్రీనివాసరావుకు పదోన్నతి లభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

నక్కపల్లి : స్థానిక తహసీల్దార్‌గా ఎం. శ్రీకాంత్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అంబేద్కర్ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అదే జిల్లాకు చెందిన శ్రీకాంత్‌ను నియమించారు. తహసీల్దార్‌గా నియమితులైన శ్రీకాంత్‌ను డిప్యూటీ తహసీల్దార్ నీరజ, జూనియర్ అసిస్టెంట్ కన్నబాబు అభినందించారు.